క్లుప్తంగా

పరామర్శ


వెంకటప్పడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ చంద్రశేఖర్

గుర్ల: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మంత్రి వెంకటరమణ తండ్రి వెంకటప్పుడు అనారోగ్యంతో ఇటీవల మరణించారు. గుర్లలో ఆయన కుటుంబాన్ని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ శనివారం పరామర్శించారు. వెంకటప్పుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు తాడేల ఉమామహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్ ఉన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సహాయం


బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్‌సొసైటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు

మెరకముడిదాం: మండలంలోని గరుగుబిల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పూరిళ్లతో పాటు సర్వం కోల్పోయిన మూడు కుటుంబాలకు రెడ్‌క్రాస్ సొసైటీ సహాయం అందజేసింది. నిత్యావసర సరుకులతో పాటు వంట పాత్రలు, ఇతర సామగ్రితో కూడిన కిట్‌ను రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు బి.వి.గోవింద్‌రాజులు, ముడిదాపురాము, ఎంపీటీసీ చందక చిరంజీవినాయుడు, సర్పంచ్ ఆవాల అప్పలనాయుడు కలిసి బాధితులకు శనివారం అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులను స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.

గెడ్డవాగు ఆక్రమణలపై సర్వే

కొత్తవలస: కొత్తవలస గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 142–1లోని గెడ్డవాగు ఆక్రమణలపై అందిన ఫిర్యాదుల మేరకు తహసీల్దార్ హేమంత్‌కుమార్ ఆదేశాల మేరకు మండల సర్వేయర్ గంగాధర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం సర్వే నిర్వహించారు. సుమారు 1.45 ఎకరాల గెడ్డవాగును సిబ్బంది పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులను నిర్ధారించారు. గెడ్డవాగులో కొంత భూమిని 22 మంది ఆక్రమించారని, వీరిలో కొంత మంది ఇప్పటికే ఇళ్లు నిర్మించుకోగా, మరికొంత మంది ఇళ్ల నిర్మాణాలకు పూనుకుంటున్నట్టు, మరికొంత స్థలానికి ఫెన్సింగ్ వేసి ఉన్నట్టు సర్వే సిబ్బంది గుర్తించారని తహసీల్దార్ తెలిపారు. ఆక్రమణదారులకు ముందుగానే నోటీసులు జారీ చేశామన్నారు. ప్రస్తుతం సర్వే ప్రకారం పూర్తిస్థాయిలో ఆక్రమణదారులను గుర్తించి, చట్టప్రకారం ఆక్రమణలను తొలిగిస్తామన్నారు. వీఆర్‌ఓ కృష్ణమోహన్, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


బాధితుడికి నగదు అందజేస్తున్న వాకాడ గోపి

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బలివాడ రమేష్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్థిక సాయం చేశారు.ఎస్ఎంఎస్ ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వాకాడ గోపి రూ.10వేలు, గరివిడి పట్టణానికి చెందిన బమ్మిడి అప్పలస్వామి,వలిరెడ్డి లక్ష్మణ,పచ్చిపల్లి కుమార్,వలిరెడ్డి వాసు,నీలాద్రి సూర్యనారాయణ,బాగు రమేష్,బాగు అంకుల్ రూ. 11వేలు అందజేశారు.

బహుమతుల ప్రదానం


విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

కొత్తవలస: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి నెలలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. విజేతలకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.సన్యాసిపాత్రుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మండల కేంద్రంలో శనివారం బహుమతులు ప్రదానం చేశారు. ఎల్.కోట ఎంపీపీ శ్రీనివాసరావు, కొత్తవలస వైస్ ఎంపీపీ శ్రీను, కొత్తవలస మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నాయుడు, నాయకులు వెంకటరావు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'

జామి: లక్ష్మీపురం గ్రామంలో జామి పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యరేఖ ఆధ్వర్యంలో శనివారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 60 మందికి సిబ్బంది వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులు, చిన్నారులకు వైద్య తనిఖీలు చేశారు.

నేత్రవైద్య శిబిరం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం కుమరాంలో మానవీయతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నేత్రవైద్య శిబి రం నిర్వహించారు. గరివిడి కంటి ఆస్పత్రి సిబ్బంది 46 మందికి నేత్ర పరీక్షలు చేసి 23 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. మానవీయతా స్వచ్ఛందసేవాసంస్థ అధ్యక్షుడు గోవిందరాజులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

- ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య


నమూనా చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

బొండపల్లి: మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండల కేంద్రంలోని భువి లేఅవుట్‌లో ఎంపీపీ చల్ల చలంనాయుడు అధ్యక్షతన శనివారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలకు ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 1,138 స్వయం సహాయక సంఘాలు ఉండగా 11,942 మంది సభ్యులకు ఆసరా మూడో విడత ఆర్థిక సహాయం రూ.7.71 కోట్లు వారి ఖాతాల్లో ప్రభుత్వం జమచేసిందని చెప్పారు. 2019 ఎన్నికల సమయానికి డ్వాక్రా సంఘాలకు ఉన్న రుణాల మొత్తాన్ని నాలుగు విడతల్లో అక్క చెల్లెమ్మలకు అందిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని అన్నారు. ఇప్పటికి మూడు విడతల్లో రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాల సభ్యులకు రూ.19,178 కోట్లు అందించారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం ఈ నాలుగేళ్ల పాలనలో అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని, మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. ఎక్కడా అవినీతీ, అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు గ్రామ వలంటీర్లు, సచివాలయాల ద్వారా అందిస్తున్నామని అన్నారు.


సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆసరా లబ్ధిదారులు


సంబరాలకు హాజరైన లబ్ధిదారులు

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం

సీఎం జగన్ విద్య,వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే అప్పలనరసయ్య చెప్పారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ స్కూళ్లతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేసి పేదలకు నాణ్యమైన విద్య,వైద్యం అందించడానికి కృషి చేస్తున్నారన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో అమ్మఒడి, విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలను అమలు చేస్తున్నట్టు వివరించారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధన చేయాలని ప్రభుత్వం చర్యలు తీసుకుంటే దానిని అడ్డుకునేందుకు టీడీపీ వారు కోర్టుల ద్వారా చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ స్కూళ్లలో సీబీఎస్ఈ సిలబస్‌తో పాటు డిజిటల్ తరగతులు నిర్వహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

టీడీపీ పాలనలో అభివృద్ధి చెందింది ఆ నలుగురే ..

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కేవలం నలుగురు మాత్రమే ఈ రాష్ట్రంలో అభివృద్ధి చెందారని దుయ్యబట్టారు. చంద్రబాబు,ఆయన కుమారుడు లోకేష్, పచ్చపత్రికలు, పచ్చమీడియా చానెళ్లు మాత్రమే అభివృద్ధి చెందాయి తప్ప, సామాన్య ప్రజలకు ఒరిగింది ఏమి లేదన్నారు. టీడీపీ పాలనలో ప్రజలకు మేలు జరిగేలి ఏమైనా పథకాలు అమలు చేశారా..? ఏదైనా అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, ఎంపీపీ చల్లా చలంనాయుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, మండల ప్రత్యేక అధికారి ఎస్.కె.వి.దుర్గాప్రసాద్, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, వెలుగు ఏరియా కో– ఆర్డినేటర్ వి.లక్ష్మునాయుడు, తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఏ.వేదవతి, వైస్ ఎంపీపీలు మీసాల సరోజిని, జి.ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ బండారు బంగారం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, సచివాలయ మండల కన్వీనర్ పల్లి రఘు, తాళ్లపూడి కృష్ణ, వెలుగు ఏపీఎం కె.సులోచనాదేవి, గొట్లాం,రాచకిండాం పీఏసీఎస్ చైర్మన్లు మహంతి రమణ, జి.సతీష్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు


వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శ్రీనివాసరావు

కొత్తవలస: పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచుందుకు, వారి అభ్యున్నతి కోసమే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను రూపొందించి, పారదర్శకంగా అమలు చేస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస మేజర్ పంచాయతీలో సచివాలయం–1 పరిధి 202 కాలనీలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. పథకాల అమలు తీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పలుచోట్ల సీసీ రోడ్డులు, డ్రైనేజీలు నిర్మించాలని, కొన్ని చోట్ల మరమ్మతులు చేయాలని స్థానికులు కోరారు. అలాగే కొంతమంది ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి అందుకు తగ్గట్టుగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని ప్రజలను అభ్యర్థించారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, జెడ్పీటీసీ నెక్కలి శ్రీదేవి, సర్పంచ్ మచ్చ రామస్వామి, పార్టీ నాయకులు మేలాస్త్రి అప్పారావు, పెనగంటి చెల్లయ్య, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.


గజపతినగరం రూరల్: పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

ఇంటింటికీ పారదర్శకంగా పథకాలు

గజపతినగరం రూరల్: పార్టీలకు అతీతంగా ఇంటింటికీ పారదర్శకంగా పథకాలు అందిస్తున్నామని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని గంగచోళ్లపెంట గ్రామంలో శనివారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధి, ఎస్సీకాలనీ, యాతవీధిలో ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ఆయన దృష్టి పలు సమస్యలు తీసుకురాగా, వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. స్థానిక యువత ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపికను సత్కరించారు. సర్పంచ్ బోని సంగమయ్య, ఎంపీటీసీ గెడ్డెన్న, పీఏసీఎస్ చైర్మన్ కరణం ఆదినారాయణ, నాయకులు బెల్లాన త్రినాథ్, మండల సురేష్, సచివాలయ కార్యదర్శి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

నేడు ఆసరా సంబరాలు

దత్తిరాజేరు: మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం వైఎస్సార్ ఆసరా మూడోవిడత సంబరాలు నిర్వహించనున్నట్టు ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి తెలిపారు. సంబంధిత ఏర్పాట్లను గజపతినగరం సీఐ ఎల్.అప్పలనాయుడుతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసరా సంబరాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హాజరవుతారని చెప్పారు. సభకు వచ్చే మహిళలకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహదేవ్ ఫణీంద్రుడు,సర్పంచ్ రంభ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


దత్తిరాజేరులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

వేపాడలో ..

వేపాడ: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉదయం వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పట్నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

4న మెరకముడిదాంలో...

మెరకముడిదాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈనెల 4వ తేదీన మధ్యాహ్నం వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించనున్నట్టు వెలుగు ఏపీఎం లెంక ఉమామహేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అతిథిగా హాజరుకానున్నారని, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొనాలని కోరారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

చీపురుపల్లి/ గుర్ల/చీపురుపల్లిరూరల్(గరివిడి)/ దత్తిరాజేరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత గృహసారథులపై ఉందని వైఎస్సార్‌సీపీ ప్రధాన, మండల నాయకులు అన్నారు. 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం అమలుపై గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఇంటికి గృహసారథులు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, జరిగిన మేలును వివరించాలని సూచించారు. సీఎం సందేశాన్ని అందజేయాల న్నారు. ప్రజామద్దతు పుస్తకాల్లో ఉన్న ప్రశ్నలను అడిగి వారి నుంచి వచ్చిన సమాధానాలు వాటిలో నింపి పంపించాల్సి ఉందన్నారు. అనంతరం గృహసారథులకు జగనన్నే మా భవిష్యత్ కిట్లను అందజేశారు.


దత్తిరాజేరు: గృహసారథులకు 'జగనన్నే మా భవిష్యత్' కిట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


గుర్ల: గృహ సారథులకు కిట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ అప్పలనాయుడు


చీపురుపల్లిరూరల్(గరివిడి): జగనన్న నువ్వే మా భవిష్యత్ కిట్లను పంపిణీ చేస్తున్న మండల నాయకులు


చీపురుపల్లి: రామలింగాపురంలో గృహ సారథులకు కిట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న కేసలి అప్పారావు

గుర్ల: బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గుర్ల మండలంలోనే అత్యధిక బాల్య వివాహాలు జరుగుతున్నాయని, బాల్య వివాహాల నియంత్రణపై అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు దృష్టిసారించడం లేదని అగ్రహం వ్యక్తం చేశారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ శాంత కుమారి, ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతి రావు, ఎంపీడీఓ కల్యాణి, డీటీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలకు పరిష్కారం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచించారు. పాత ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. అధికారులు శాఖల వారీగా ప్రగతినివేదికలు చదివి వినిపించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు,ఎరువులు,రాయితీపై వ్యవసాయ పరికరాలు అందించేందుకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. మండలంలో ఇంటింట కుళాయిలకు ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకం కింద రూ. 90కోట్లు మంజూరు చేసిందన్నారు. విద్యుత్ సమస్యలపై పలువురు సభ దృష్టికి తీసుకురాగా, సమస్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ కృష్ణమూర్తిని ఎమ్మెల్యే ఆదేశించారు. జెడ్పీటీసీ గార తవుడు,ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం, తహసీల్దార్ ఎం.అరుణకుమారి, వైస్ ఎంపీపీలు గెద్ద దమయంతి, కర్రి శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ

లక్కవరపుకోట: జమ్మాదేవిపేటలోని జ్యోతీరావు పూలే ఆశ్రమ బాలికల పాఠశాల పదోతరగతి విద్యార్థినులకు సత్యసాయిట్రస్టు ఫర్ యూనివర్సల్ వెల్ఫేర్ వారు పరీక్ష సామగ్రి సమకూర్చారు. ప్లాంకులు, పెన్నులు,జామెట్రీ బాక్సు తదితర సామగ్రిని ఎంఈఓ సీహెచ్.కూర్మారావు విద్యార్థినులకు అందజేశారు. ట్రస్టు సభ్యులు శ్రీరామ్మూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌పాత్రో పాల్గొన్నారు.

భైరిపురం పాఠశాల విద్యార్థులకు...

మెరకముడిదాం: భైరిపురం ఉన్నతపాఠశాల పదోతరగతి విద్యార్థులకు జామెట్రీ బాక్సులు, పరీక్ష సామగ్రిని గ్రామానికి చెందిన ఉటుకూరుశ్రీనివాస్, ఉటుకూరువిష్ణు సమకూర్చారు. హెచ్ఎం ఆచార్యులు వాటిని విద్యార్థులకు శనివారం పంపిణీ చేశారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి


బొండపల్లి: ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి దుర్గా ప్రసాద్


చీపురుపల్లిరూరల్: పెదనడిపల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

బొండపల్లి/ చీపురుపల్లిరూరల్: జగనన్న లే అవుట్లతో పాటు సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని బొండపల్లి మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.కె.దుర్గా ప్రసాద్, చీపురుపల్లి ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా బొండపల్లి మండలంలోని కనిమెరక, చీపురుపల్లి మండలంలోని పెడనడిపల్లి గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను శనివారం వారు పరిశీలించారు. స్లాబులు పూర్తయిన గృహాలను ఈనెల 15 నాటికి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు. బొండపల్లి తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు, హౌసింగ్ ఏఈఈ రమణరాజు, చీపురుపల్లి హౌసింగ్ ఏఈలు సత్యనారాయణ పాల్గొన్నారు.

నిర్మాణాలు త్వరగా ప్రారంభించాలి

కొత్తవలస: ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించాలని మండల ప్రత్యేక అధికారి పాపారావు సూచించారు. చీడివలస పంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులతో శనివారం సమావేశమయ్యారు.గతంలో రామలింగాపురం,చీడివలస గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు వేరొక ప్రదేశంలో లేవుట్ ఏర్పాటు చేసి పట్టాలు అందజేయగా ఆ లేఅవుట్ పోలవరం ఎడమ కాలువ నిర్మాణంలో కలిసిపోయింది. అక్కడ పట్టాలు ఇచ్చిన 72 మంది కోసం చీడివలస పంచాయతీలో లేఅవుట్ వేసి స్థలాలు కేటాయించారు. కొత్త లేఅవుట్ లో నిర్మాణాలు ప్రారంభించి, వేగంగా పూర్తి చేయాలని లబ్ధిదారులను ప్రత్యేక అధికారి కోరారు . ఎంపీడీఓ పద్మజ, హౌసింగ్ ఏఈ రాంప్రసాద్ పాల్గొన్నారు.

అయిదు దశాబ్దాల స్నేహం


1972-73 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

చీపురుపల్లి: అయిదు దశాబ్దాల క్రితం వారంతా చీపురుపల్లిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్నారు. 1972-73 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్నారు. వీరిలో కొంతమంది వివిధ ఉద్యోగాలు చేసి పదవీ విరమణ చేశారు. యాభై ఏళ్ల తర్వాత వీరంతా తాము చదువుకున్న పాఠశాలలోనే శనివారం కలుసుకుని, నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వీరంతా 2018లో పాఠశాలలో కళావేదిక నిర్మాణానికి సహకారం అందించారు. భవిష్యత్‌లో పాఠశాలకు మరింత సహకారం అందించాలని తీర్మానించుకున్నారు. పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ఎస్.సన్యాసిరావు, పి.ప్రభాకరరావు, డాక్టర్ టి.నీలకంఠేశ్వరరావు, పి.ఎస్.ఎన్.రాజు, ఎస్.కోటేశ్వరరావు, ఆర్.ఎల్. నారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో 61మంది ఎంపిక

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి అవంతి సెయింట్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో వివిధ కళాశాలలకు చెందిన 61 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని అవంతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ తెలిపారు. ఎంఈసీహెచ్, ఈఈఈ విభాగాల్లో డిప్లమో, బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు చెన్నై కోర్ కంపెనీ వీల్స్ ఇండియా లిమిటెడ్ (టీవీఎస్ గ్రూపునకు చెందిన మెకానికల్,ఎలక్ట్రికల్) హెచ్ఆర్, డిప్యూటీ మేనేజర్ ఎం.దివాకర్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరిగాయి. అవంతి కళాశాలతో పాటు వివిధ కళాశాలల నుంచి 256 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి రాతపరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి 61 మందిని ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు అందజేశారు. కంపెనీ డిప్యూటీ మేనేజర్ మాట్లాడుతూ టీవీఎస్ కంపెనీకి దేశవ్యాప్తంగా 15 బ్రాంచ్‌లు ఉన్నాయని, 9వేలు మంది ఉద్యోగులు పని చేస్తున్నారని చెప్పారు.


క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు ప్రొడక్ట్ డవలప్‌మెంట్ ఇంజినీర్, క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్, ప్రోసెస్ కంట్రోల్ ఇంజినీర్‌గా పనిచేస్తారని, సామర్థ్యాన్ని బట్టి రూ.2.5 లక్షల నుంచి రూ.4లక్షలు వరకు వార్షిక వేతనం ఉంటుందని తెలిపారు.వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, ప్లేస్మెంట్ అధికారులు ఎస్.చంద్రశేఖర్, ఎం.మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు

జామి: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఆర్.ఝాన్సీ ఆధ్వర్యంలో మండలానికి సంబంధించిన క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం జెండా ఊపి ప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి బోర్లకు మరమ్మతులు చేయించనున్నట్టు చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం సిబ్బంది గ్రామాల్లో బోర్లకు మరమ్మతులు చేయడం , అవసమైన చోట కొత్త పైపులు అమర్చడం వంటి పనులు చేస్తారని తెలిపారు. 45రోజుల పాటు క్రాస్ ప్రోగ్రాం ఉంటుందన్నారు. ఎంపీడీఓ సతీష్, ఈఓపీఆర్డీఓ ఎ.వి.లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ పాల్గొన్నారు.


జామి: సమ్మర్ క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ సరయు


గజపతినగరం: మ్మర్ క్రాస్‌ప్రోగ్రాం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ జ్ఞానదీపిక, జెడ్పీటీసీ తవుడు

క్రాస్ ప్రోగ్రాం నిర్వహణకు రూ.5 లక్షలు

గజపతినగరం: సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం ద్వారా గ్రామాల్లో తాగునీటి బోర్ల మరమ్మతులకు ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసిందని ఎంపీడీఓ పప్పు సుదర్శనం తెలిపారు. మండలానికి సంబంధించిన సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నానిబాబు ఆధ్వర్యంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ గార తవుడు ఎంపీడీఓ వద్ద శనివారం జెండా ఊపి ప్రారంభించారు. నాయకులు బెల్లాన త్రినాథరావు, గేదెల ఈశ్వరరావు, కర్రి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బోర్ల మరమ్మతులు

దత్తిరాజేరు: క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా దత్తిరాజేరు,ఇంగిలాపల్లి కోమటిపల్లి గ్రామాల్లో శనివారం తాగునీటి బోర్ల మరమ్మతులు చేయించామని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం అన్ని గ్రామాల్లోని తాగునీటి బోర్లను సిబ్బంది పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేస్తారని చెప్పారు.